ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
3★★★
బుధవారం 2 జూలై 2025



- పొదుపు గ్రూపుల ఏర్పాటుకు కసరత్తు
- మెప్మా ద్వారా కామన్ ఇంట్రెస్ట్ గ్రూప్‌లు
- జిల్లాలో 10వేల మందికి పైగా వీధి వ్యాపారులు



వీధి వ్యాపారుల్లో రుణాల ఆశలు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

వీధి వ్యాపారులను పొదుపు వైపు మళ్లించి వ్యాపార అభివృద్ధికి రుణాలు అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. స్వశక్తిమహిళా సంఘాల తరహాలోనే ప్రభుత్వం కామన్‌ఇంట్రెస్ట్ గ్రూప్(సీఐజీ)లను ఏర్పాటు చేయాలని మెప్మాకు ఆదేశాలు ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే మెప్మా ద్వారా జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలలో సీఐజీ గ్రూపుల ఏర్పాటుకు వీధివ్యాపారులను గుర్తిస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 10వేలకు పైగా వీధి వ్యాపారులు ఉన్నారు. తోపుడు బండ్లపై పండ్లు, మిర్చి, బజ్జీల వంటి విక్రయాలు, ప్రధాన కూడళ్లలో బట్టలు, ప్లాస్టిక్ వస్తువులు అమ్ముకోవడం, మరికొందరు పట్టణాల నుంచి గ్రామాలకు వస్తువులు తీసుకువెళ్లి అమ్ముకుంటూ ఉపాధి పొందుతున్నారు.

బ్యాంక్ లింకేజీతో రుణాలు..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో గతంలో పీఎం స్వనిధి పథకంలో వీధి వ్యాపారులకు రుణాలు అందించారు. గత సంవత్సరం డిసెంబర్‌లో స్వనిధిలో కేంద్ర ప్రభుత్వం కొత్తగా రుణాలు ఇవ్వడాన్ని తాత్కాలికంగా నిలిపివేసింది. ఇదేక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం సీఐజీల ద్వారా వీధి వ్యాపారులకు రుణాలు అందించడానికి ఆదేశాలు ఇవ్వడంతో వ్యాపారులకు ఊరటగా మారనుంది. వీధి వ్యాపారుల్లో 5మంది నుంచి 10మంది వరకు కామన్ ఇంట్రెస్ట్ గ్రూపులుగా ఏర్పాటు చేసి వారికి బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు అందించాలని నిర్ణయించారు. ఆరు నెలల పాటు సీఐజీల ద్వారా వీధి వ్యాపారులు పొదుపు చేసుకుంటే మొదటి విడతగా రూ75వేల వరకు రుణం అందిస్తారు. తర్వాత దాన్ని రెట్టింపు చేస్తారు. వీధి వ్యాపారంలో స్ట్రీట్ వెండర్ గుర్తింపు కార్డు ఉన్న వారిలో ఆడ, మగ తేడా లేకుండా కలిపి గ్రూపుగా ఏర్పాటు చేస్తారు. మహిళలకు మాత్రం ఇతర పొదుపు సంఘాల్లో సభ్యురాలుగా ఉంటే సీఐజీలో తీసుకోరు. వీధి వ్యాపారులకు ఎంతో ఉపయోగకరంగా ఉండే సీఐజీ ఏర్పాటుకు జిల్లా మెప్మా వీధి వ్యాపారులు గుర్తింపును వేగంతం చేసింది.

నిలిచిన స్వనిధి రుణాలు..

వీధి వ్యాపారులకు చేయూతనిచ్చే దిశగా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి స్వనిధి(అత్మనిర్భర్‌నిధి) రుణాల పక్రియ 2020సంవత్సరంలో కరోనా లాక్‌డౌన్‌లో తీసుకవచ్చింది. ఈ పథకం ద్వారా వీధి వ్యాపారులకు రుణాలు అందించి చిరు వ్యాపారాన్ని కొనసాగించుకునే దిశగా మూడు విడతలుగా అందించే స్వనిధి రుణాలు డిసెంబరుతో నిలిపివేసింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో చిరు వ్యాపారులు మాత్రం రుణాలు అందక నిరాశ చెందుతున్నారు. వీధి వ్యాపారులకు మొదటి విడతగా రూ10వేలు, అది చెల్లించిన తరువాత రెండో విడతగా..... మిగతా 6లో

ఆగస్టు 31 వరకు చేపలు పట్టడం నిషేధం

సిరిసిల్ల టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలోని మధ్య మానేరు, ఎగువ మానేరు, అన్నపూర్ణ రిజర్వాయర్ పరిసర ప్రాంత లైసెన్స్‌దారులు జూన్ 1 నుంచి ఆగస్టు 31వరకు చేపలు పట్టడం నిషేధం అని మంగళవారం జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్య తెలిపారు. మత్స్యశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఆగస్టు 31 వరకు చేపలు పట్టవద్దని సూచించారు. జూన్ 1 నుంచి చేపల సంతతి అభివృద్ధి కోసం అండ విసర్జన చేసి చేపల సంతతిని అభివృద్ధి పరుస్తారని పేర్కొన్నారు. జలాశయాలలో చేపల సంఖ్య పెరిగిన తర్వాత కాలంలో మత్స్యకారులు చేపలు పట్టుకునేందుకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. రెండు నెలల పాటు జలాశయాల్లో చేపలు పట్టినా, అమ్మినా లైసెన్స్ రద్దు చేస్తామని, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేసిన డీఐవో

వేములవాడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శ్రీనివాస్ మంగళవారం తనిఖీ చేశారు. కళాశాలలోని తరగతి గదులను పరిశీలించి, కళాశాలలో కొనసాగుతున్న విద్యార్థుల ప్రవేశాలు, ఇతర అంశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సి.హెచ్.శరత్ కుమార్, అధ్యాపకులు శేఖర్, జలపతి, ఇ.మహేందర్, రవీందర్, జయభరత్ రెడ్డి, గోపి, సంతోష్, నరసింహమూర్తి, అంజయ్య, మహేందర్‌రెడ్డి, అశోక్, లత, మంగమ్మ, స్వప్న, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటాం..

- ఏఎస్పీ చంద్రయ్య



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఏఎస్పీ చంద్రయ్య

చందుర్తి జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామని అదనపు ఎస్పీ చంద్రయ్య అన్నారు. చందుర్తి మండలం కిష్టంపేట గ్రామాన్ని ఏఎస్పీ చంద్రయ్య మంగళవారం సందర్శించారు. ఇటీవల తేలుకాటుకు గురై సరైన వైద్యం అందక బాలిక మృతిచెందగా, ఆర్ఎంపీపై నమోదైన కేసులో మృతురాలి కుటుంబ సభ్యులను, ఇతర సాక్షులను విచారించారు. ఈ సందర్భంగా అయన గ్రామస్తులతో మాట్లాడుతూ మూఢనమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. క్రిమి కీటకాలు పలు జాగ్రత్తలు తీసుకోవలన్నారు. ఈ కార్యక్రమంలో చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి రాజన్న ప్రసాదం



రాంచందర్‌రావును సత్కరిస్తున్న ప్రతాప రామకృష్ణ

వేములవాడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన రాంచందర్‌రావును పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో రాంచందర్‌రావును కలిసిన ప్రతాప రామకృష్ణ తదితరులు ఆయనను రాజరాజేశ్వర స్వామి శేషవస్త్రంతో సత్కరించి ప్రసాదం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వేములవాడ పట్టణ బీజేపీ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కృష్ణస్వామి, రేగుల మల్లికార్జున్, సంటి మహేష్ ఉన్నారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ట్రైయాతలాన్ పోటీలు



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులు

సిరిసిల్ల టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ట్రైయాతలాన్ పోటీలను మంగళవారం నిర్వహించారు. జిల్లా పరిధిలోని 13మండలాల విద్యార్థులు పోటీలలో పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ సర్టిఫికెట్లను ప్రదానం చేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 20 మంది విద్యార్థులను ఎంపిక చేసి ఈనెల 6న హన్మకొండ జిల్లా కేంద్రంలోని నెహ్రూ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. పోటీలకు సహకరించిన వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పిల్లి రామచంద్రం, సంయుక్త కార్యదర్శి అజయ్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాస్, రవి, హనుమంతు, అభినయ్, బాబు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కూలిన వృక్షం.. తప్పిన ప్రమాదం..



నేలకూలిన నిద్ర గన్నేరు వృక్షం

సిరిసిల్ల టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : వన మహోత్సవంలో భాగంగా దాదాపు 25 సంవత్సరాల క్రితం నాటిన నిద్ర గన్నేరు మొక్క వృక్షమైంది. నిత్యం వివిధ పనులపై జిల్లా కేంద్రానికి వచ్చిపోయే ప్రజలకు నీడనిచ్చింది. మంగళవారం రాత్రి కురిసిన గాలివానకు వృక్షం కుప్పకూలింది. ఆ సమయంలో ప్రజలు చెట్టు కింద లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పాతబస్టాండ్ ప్రాంతంలో మిగిలిన ఈ ఒక్క చెట్టు కూడా వేర్లతో సహా పడిపోయింది. ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు అప్రమత్తమై రోడ్డుపై నుంచి చెట్టు కొమ్మలను తొలగించి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చేశారు.

జూనియర్ కళాశాలల్లో మెరుగైన బోధన

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా 6

మొక్కలు నాటే ప్రక్రియను పూర్తి చేయాలి

- డీఆర్డీవో శేషాద్రి



మొక్కలు నాటే పనులను పరిశీలిస్తున్న డీఆర్డీవో శేషాద్రి 6

సైబర్ నేరాల నియంత్రణే లక్ష్యం : ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్ బి. గీతే

సిరిసిల్ల క్రైం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల నియంత్రణే లక్ష్యమని ఎస్పీ మహేశ్ బి. గీతే అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సైబర్ వారియర్స్‌తో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. సైబర్ నేరాలు, సైబర్ నేరానికి గురైతే ఎలా స్పందించాలనే అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రతి సైబర్ వారియర్స్‌గా పనిచేయాలన్నారు. సైబర్ నేరాలపై వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి కేసులు నమోదు చేయాలన్నారు. బ్యాంకులో ఫ్రీజ్ కాబడి నగదు బాధితులకు అందేలా కృషిచేయాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. సైబర్ నేరాలకు గురైన బాధితులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి పోలీస్ స్టేషన్‌లో సైబర్ వారియర్స్ నియమింపబడ్డారన్నారు. అనుకోని రీతిలో సైబర్ నేరానికి గురైతే కంగారుపడకుండా వెంటనే 1930 ఫోన్ నంబర్‌కు, ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌కు, దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో ఉన్న సైబర్ వారియర్‌ను స్పందించాలన్నారు. ఇందుకు ప్రతి పోలీస్ స్టేషన్‌లో సైబర్ వారియర్స్ కోసం ప్రత్యేకంగా ఒక ఫోన్‌నంబర్ అందుబాటులో ఉంటుందన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఉన్న సైబర్ వారియర్స్‌కి అనుమానిత లింక్స్ విశ్లేషించడం, అలాగే సోషల్ మీడియా, ఆన్‌లైన్ ఆర్థిక మోసాలపై దర్యాప్తు చేయడం వంటివాటిపై శిక్షణ ఇచ్చామన్నారు. సైబర్ నేరగాళ్ల వలలో విద్యావంతులే అధికంగా మోసపోతుండడం బాధాకరమని మల్టీ లెవల్ మార్కెటింగ్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, ఇతర ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. పోలీస్ శాఖ నుంచి ఎలాంటి వాట్సాప్ వీడియో కాల్స్ చేయరని, డిజిటల్ అరెస్టులని కాల్స్ వస్తే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజల బలహీనతలే సైబర్ నేరస్థుల బలంగా మారిందన్నారు. సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా ఉండటానికి అప్రమత్తతే ప్రధాన ఆయుధమన్నారు. ఈ సమావేశంలో జిల్లా సైబర్ సెల్ ఆర్ఎస్ఐ జునైద్, సైబర్ సెల్ సిబ్బంది, అన్ని పోలీస్‌స్టేషన్‌ల సైబర్ వారియర్స్ పాల్గొన్నారు.

ప్రతిరోజు ఇసుకకు అనుమతివ్వాలి

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



సిరిసిల్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అవసరాల కోసం ప్రతిరోజు సిరిసిల్ల మానేరు వాగులో నుంచి ఇసుకను తీసుకోవాడానికి అనుమతినివ్వాలని సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా ప్రధానకార్యదర్శి మూషం రమేష్, పట్టణ కార్యదర్శి అన్నల్‌దాస్ గణేష్ మాట్లాడారు. సిరిసిల్ల పట్టణాన్ని అనుకొని ఉన్న మానేరు వాగు ఉండి అందులో కావాల్సినంతం ఇసుక ఉండి కూడా పట్టణ ప్రజలు ఇంటి నిర్మాణాలకు ఇసుక తీవ్ర ఇబ్బందులకు గురైతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత కొన్ని నెలలుగా కొత్తగా ప్రభుత్వం, జిల్లా అధికారులు పెట్టిన నిబంధనలతో 15 రోజులకు ఒక్కసారి మాత్రమే మానేరు వాగులో ఇసుకను తీసుకొవడానికి అనుమతులు ఇవ్వడంతో ఇసుక దొరక స్థానిక ప్రజలు రూ. 4వేల నుంచి రూ. 5వేల వరకు బ్లాక్‌లో కొనుకునే పరిస్థితులు దాపురించాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం నిర్మించే సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఇతర నిర్మాణ పనులకు అనుమతినిచ్చే ఇసుకను రెవెన్యూ అధికారుల సహకారంతో ట్రాక్టర్ యజమానులు బ్లాక్‌లో అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. వే బిల్లులను పరిశీలిస్తే దొంగలు బయటపడతారని అన్నారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం వల్లన ఇసుక ఎక్కువ అవసరం ఏర్పడిందని ప్రస్తుతం వర్షకాలం కాబట్టి వర్షాలతో వాగులో నుంచి ఇసుక తీయడం వీలు కాదన్నారు. ప్రభుత్వం జిల్లా అధికారులు ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఇసుకను బ్లాక్‌లో అమ్మకుండా నిఘా పెట్టాలని ఇసుకను బ్లాక్‌లో అమ్ముకునే ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేయాలని డిమాండ్‌చేశారు. స్థానిక అవసరాల కోసం మాత్రం ప్రతిరోజు ఇసుక తీసుకునేందుకు అనుమతులను ఇవ్వాలని రూ.1500లకే ఒక్క ట్రాక్టర్ ఇసుక ధరను నిర్ణయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ, నాయకులు పాల్గొన్నారు.

సెస్ చైర్మన్ అక్రమాలపై విచారణ జరపాలి



మాట్లాడుతున్న సెస్ రిటైర్డ్ ఉద్యోగులు

సిరిసిల్ల టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : సెస్ చైర్మన్ చిక్కాల రామరావు అవినీతి అక్రమాలపై విచారణ జరపాలని సంస్థ రిటైర్డ్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సెస్ చైర్మన్‌గా చిక్కాల రామారావు 2007 నుంచి 2010 వరకు అనేక అవినీతి అక్రమాలకు పాల్పడ్డాడని ఆరోపించారు. ఆయన అవినీతి అక్రమాలపై ఇంకా విజిలెన్స్ అధికారులు విచారణ జరుపుతున్నారని అన్నారు. సెస్ నష్టంలో ఉన్నా కూడా 116సీ ప్రకారం సెస్ చైర్మన్ చిక్కాల రామారావు ప్రతి నెల రూ.లక్ష 50 వేలు జీతం తీసుకుంటున్నాడని ఆరోపించారు. చైర్మన్ తీసుకుంటున్నా జీతంను ఆపివేయాలని తీసుకున్న జీతం డబ్బులను రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. సెస్‌లో లైజన్ ఆఫీసర్‌గా ఎం రాంరెడ్డి(రిటైర్డ్ ఎల్ఐ)ని తీసుకొని చైర్మన్ తన సొంత పనులకు వాడుకుంటున్నాడని ఆరోపించారు. రాంరెడ్డికి నెలకు జీతం రూ.40వేలు ఇస్తూ అందులో నుంచి చైర్మన్ తన ఖర్చులకు నెలకు రూ.15వేలు తీసుకుంటున్నాడని ఆరోపించారు. 2017 నుంచి 2025 మే వరకు సెస్ నుంచి మొత్తం రూ. 38లక్షలు చెల్లించడం జరిగిందన్నారు. వెంటనే రాంరెడ్డిని తొలగించి తనకు చెల్లించిన మొత్తం డబ్బులను కూడా రికవరీ చేయలని డిమాండ్ చేశారు. ఆర్‌సీఎ అనుమతి లేనందున్న రాంరెడ్డిని వెంటనే తొలగించాలన్నారు. సిరిసిల్ల సాయినగర్‌లోని సెస్ స్టోర్స్‌ను పెద్దూర్ బైపాస్‌కి మార్చి అక్కడ కౌంపౌండ్, రెండు సార్లు బోర్ వేయడానికి ఇతర పనుల కోసం ఎలాంటి టెండర్స్ లేకుండా తన కమీషన్ కోసం అధిక బిల్లులు పెట్టి చైర్మన్ డబ్బులు తీసుకున్నాడని ఆరోపించారు. దీనిపై కూడా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సెస్ పాలక వర్గం సమావేశంలో ఎజెండా అంశాలపై అధ్యక్షుల అనుమతి అని రాయించి అనేక అవినీతి అక్రమాల కార్యకలాపాలకు పాల్పడ్డాడని, చైర్మన్ అనుమతి ఇచ్చిన తీర్మానాలపై ఆర్‌సీఎస్ వారితో విచారణ జరపాలని అన్నారు.

ఈ సమావేశంలో సెస్ రిటైర్డ్ ఉద్యోగులు కే వీరరెడ్డి, టీ రాజేశ్వర్ రావు, సిహెచ్ వెంకటి, రామేశ్వర్‌రెడ్డి, ఇమామొద్దిన్, కే వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి లక్ష్మీనరసింహస్వామి సేవలో ఎస్పీ..

వేములవాడ రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి అనుబంధ దేవాలయమైన నాంపల్లి లక్ష్మీనరసింహస్వామిని మంగళవారం ఎస్పీ మహేష్ బి.గితే దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు శేష వస్త్రం కప్పి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. ఆయన వెంట వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి సంగీత



జన జాతీయ గౌరవ్ వర్ష్ వేడుకల్లో పాల్గొన్న అధికారులు

వీర్నపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ద్వారా అందే సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి సంగీత అన్నారు. వీర్నపల్లి మండలం మద్దిమల్ల తండా గ్రామంలో పీఎం జన జాతీయ గౌరవ్ వర్ష్ వేడుకల్లో భాగంగా గిరిజనులకు ధర్తి ఆబా జన్ భగీధరి అభియాన్ అవగాహన శిబిరాన్ని అధికారులు మంగళవారం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా గిరిజనులకు అందించే సబ్సిడీ పథకాలపై క్లుప్తంగా ఆయాశాఖల అధికారులు వివరించారు. గిరిజనులకు జన్‌ధన్ యోజన ఖాతాలు, ఇందిర సౌర గిరి జల వికాసం, హార్టికల్చర్, సబ్సిడీ లోన్స్, మొక్కల పెంపకం, ఉపాధి పనులు, ఆధార్ కార్డులు, ఆయుష్మాన్ భవ కార్డులు తదితర అంశాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించారు. ప్రతిఒక్క గిరిజనుడు సబ్సిడీ పథకాలను అందుకోవాలన్నారు. గిరిజనులు ఆర్థికంగా ఎదగాలనేదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఇండస్ట్రియల్ ఏడి భారతి, ఏఎంసీ చైర్మన్ రాములు నాయక్, బ్యాంకు ఎల్‌డీఎం సంతోష్, ఎమ్మార్వో ముక్తార్ పాషా, ఎంపీడీవో అబ్దుల్ వాజీద్, ఏపీవో శ్రీహరి, ఏఈవో దీపిక, అటవీ బీట్ అధికారి కిరణ్, ప్రోగ్రాం ఆర్గనైజర్ శ్యామల, టీఏ అనిత, పంచాయతీ కార్యదర్శి సాయి కుమార్, గిరిజనులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు

గంభీరావుపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ట్రైయాతలన్ పోటీలకు మండలంలోని లింగన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న లింగాల హర్ష ఎంపికయ్యాడు. జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన పోటీల్లో హర్ష ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. విద్యార్థి హర్షను పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగరాం, వ్యాయామ ఉపాధ్యాయుడు నరేష్ అభినందించారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

మల్యాల, జూలై 1(ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం మద్దుట్లకు చెందిన నల్లూరి తిరుపతి(51) అప్పుల బాధతో మంగళవారం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతి ఎడమ కాలుకు కొన్నేళ్ల క్రితం గాయం కాగా దాని చికిత్స కోసం, కుటుంబ అవసరాల కోసం అప్పులు చేశాడు. తిరుపతి అప్పులు తీర్చలేక మంగళవారం గ్రామ శివారులో ఉరి వేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి భార్య దేవేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై కేసు

ఎల్లారెడ్డిపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై అతివేగంతో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైన సంఘటనలో వరంగల్ జిల్లాకు చెందిన వాహన డ్రైవర్ వెంకటేశ్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి మంగళవారం తెలిపారు. వెంకటేశ్ తన బొలెరో వాహనంతో రగుడు బైపాస్ రోడ్డు నుంచి వెంకటాపూర్ మీదుగా కామారెడ్డి వైపు వెళుతున్నాడని పేర్కొన్నారు. వెంకటాపూర్ మూల మలుపు వద్ద వాహనం అదుపు తప్పి ఎదురుగా ఉన్న చెట్టుకు ఢీకొట్టినట్లు తెలిపారు. వెంకటేశ్ తన వాహనంతో తమ ఇంటి ముందు ఉన్న చెట్టును ఢీకొనడంతో తాము భయాందోళనకు గురయ్యామని బాధితురాలు వాగుమడి వెంకటలక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని బాలుడి మృతి

పెద్దపల్లిటౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి బస్టాండ్ వద్ద సోమవారం ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు. జూలపల్లి మండలం కుమ్మరికుంటకు చెందిన అవునూరి నితిన్ (17) చిన్నబొంకూర్‌కు చెందిన అన్వేష్ (19) రైల్వేస్టేషన్‌వైపు వెళ్లి వస్తుండగా బస్టాండ్ ఎంట్రెన్స్ వద్ద ఆర్టీసీ బస్సు ఇద్దరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నితిన్ తలకు తీవ్రగాయాలు కాగా అన్వేష్ స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే 108కు ఫోన్ చేసి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న కుటుంబీకులు ఆస్పత్రి చేరుకొని మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ నితిన్ మంగళవారం తెల్లవారు జామున మృతి చెందారు. తండ్రి భూమయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రైల్వే ట్రాక్ వద్ద గేజ్‌ను ఢీకొన్న లారీ


రైల్వే గేటు వద్ద విరిగిపడిన గేజ్

కరీంనగర్ రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారు తీగలగుట్టపల్లి రైల్వే గేటు వద్ద ఏర్పాటు చేసిన గేజ్‌ను సోమవారం లారీ ఢీకొనడంతో విరిగిపడింది. చొప్పదండి వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న రైల్వే గేటును ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో భాగంగా పక్కన ఏర్పాటు చేశారు. భారీ వాహనాలు రాకుండా గేజ్ నిర్మాణం చేపట్టారు. లోడ్‌తో వెళ్తున్న లారీ గేజ్‌ను తాకడంతో విరిగి పడింది. ఎలాంటి ప్రమాదం జరుగకపోవడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు.

ట్రాక్టర్ ఢీకొని ఒకరికి గాయాలు

వీణవంక, జూలై1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నందిపేట కొంరయ్యను ట్రాక్టర్ ఢీకొనడంతో గాయపడ్డాడు. మంగళవారం పొలం పనులు ముగించుకొని సైకిల్‌పై ఇంటికి వస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన రాధారపు అనిల్ ట్రాక్టర్‌తో ఢీకొట్టగా తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని 108 వాహనంలో కొంరయ్యను జమ్మికుంట ఆసుపత్రికి తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ అనిల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాట్టు ఎస్‌ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

పోతిరెడ్డిపల్లిలో లారీ డ్రైవర్ల ధర్నా


పోతిరెడ్డిపల్లి ఇసుక క్వారీలో ధర్నా చేస్తున్న లారీ డ్రైవర్లు

వీణవంక,జూలై01(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతిరెడ్డిపల్లి మానేరు వాగులోని ఇసుక క్వారీలో లారీ డ్రైవర్లు ధర్నా చేపట్టారు. నాలుగు రోజులుగా తాము క్వారీల వద్దే ఉంటున్నామని క్వారీ యాజమాన్యం ఇసుక లోడ్ చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. ఆన్‌లైన్‌లో బుకింగ్‌లు రావడంతో తాము క్వారీల వద్దకు వస్తే లారీలలో ఇసుక లోడ్ చేయకుండా రోజుల తరబడి వేచి ఉండాల్సి వస్తుందని అన్నారు. ప్రతి లారీకి వెయ్యి నుంచి రెండు వేలు ఇస్తేనే లారీలు లోడ్ చేస్తున్నారని ఆరోపించారు. అధికారుల పర్యవేక్షణ లేక క్వారీల యాజామాన్యం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు.ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, మైనింగ్ అధికారులు సమస్య పరిష్కరించాలని కోరారు.

కొండగట్టులో గుర్తు తెలియని వ్యక్తి మృతి

మల్యాల, జూలై 1(ఆంధ్రజ్యోతి): కొండగట్టు స్టేజీ వద్ద గుర్తు తెలియని వ్యక్తి(60) మృతి చెందినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. తమిళనాడు ప్రాంతం నుంచి వచ్చిన అతను కూలి పనులకు వెళ్తుండేవాడని స్థానికులు తెలిపారు. మంగళవారం బస్టాండ్ ప్రాంతంలో మృతి చెంది ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. ముత్యంపేట గ్రామపంచాయతీ కారోబార్ రాజేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నారు మడిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు



కరీంనగర్ రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వరి సాగుకు కరీంనగర్ మండలంలో వాతావరణ పరిస్థితులు బట్టి ఇప్పటికే పలువురు రైతులు నార్లు పోసుకున్నారు. వర్షాలు ప్రస్తుతం సమృద్ధిగా కురుస్తుండటంతో రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. ఈ సమయంలో వరి నారు పెంపకంలో జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. నారు మడిని బాగా దున్ని రెండు నుంచి మూడు సార్లు దుమ్ము చేసి చదును చేయాలి. నీరు పెట్టడానికి తీయడానికి వీలుగా కాలువలు ఏర్పాటు చేసుకోవాలి. రెండు గుంటల నారుమడికి రెండు కిలోల నత్రజని (కిలో విత్తనం చల్లే ముందు, మరో కిలో విత్తిన 12-14 రోజులకు), కిలో భాస్వరం, కిలో పొటాష్‌నిచ్చే ఎరువులను దుక్కిలో వేయాలి. పశువుల పేడా లేదా ఇతర సేంద్రియ ఎరువులను దుక్కిలో వేయాలి.

మొలకొచ్చిన విత్తనాన్ని చల్లి, మొదట్లో (వారం రోజులు) ఆరు తడులు ఇచ్చి తర్వాత మొక్క దశలో పలుచగా నీరు ఉండేలా చూడాలి. లీటర్ నీటికి రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి పిచికారి చేయాలి. నారు తీసే ఏడు రోజుల ముందు గుంట మడికి 400 గ్రాముల కార్బోఫ్యూరాన్ -3జీ గుళికలను ఇసుకలో కలిపి చల్లి పలుచగా నీరు ఉంచాలి. అవసరాన్ని బట్టి మడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. నాటు వేసేందుకు 15 రోజుల ముందు నుంచే పొలాన్ని దుమ్ము చేయాలి.

● నాటు వేసేటప్పుడు..

నాలుగైదు ఆకులున్న నారును నాటుకోవాలి. చౌడు పొలాల్లో లేతనారు వేయవద్దు. నాటిన తర్వాత ప్రతి రెండు మీటర్లకు 30 సెంటీమీటర్ల చొప్పున బాటలు తీస్తే పైరుకు గాలి వెలుతురు బాగా సోకి చీడ పీడల ఉధృతి అదుపులో ఉంటుంది. ముదిరిన నారైతే కుదురుకు 6 నుంచి 8 మొక్కల చొప్పున నాటాలి. ముదురు రంగు నారు నాటిన ప్పుడు నత్రజని ఎరువును సిఫార్సు కంటే 25 శాతం పెంచాలి.

జాతీయ రహదారి పనులు అడ్డగింత

● నష్టపరిహారం పెంచి ఇవ్వాలని రైతు డిమాండ్


చెంజర్లలో అధికారులను వేడుకుంటున్న రైతు కుమార్

మానకొండూర్, జులై 1 (ఆంధ్రజ్యోతి) : మానకొండూర్ మండలంలోని చెంజర్ల గ్రామానికి చెందిన కానిగంటి కుమార్ అనే రైతు తమకు నష్టపరిహారం తక్కువగా ఇచ్చారని రహదారి నిర్మాణ పనులను మంగళవారం అడ్డుకున్నారు. జాతీయ రహదారి 563 నిర్మాణం కోసం జగిత్యాల నుంచి వరంగల్ వరకు అధికారులు భూసేకరణ చేశారు. మానకొండూర్, అన్నారం, ముంజంపల్లి, ఈదులగట్టెపల్లి, చెంజర్ల, గట్టుదుద్దెనపల్లి గ్రామాలకు చెందిన రైతుల భూములను అధికారులు భూసేకరణ చేశారు. ప్రభుత్వం గుంటకు రూ. 63వేలు నష్టపరిహారం కింద పంపిణీ చేసింది. సుడా పరిధిలో లేని గ్రామాలకు రెండు లక్షలకు పైగా చెల్లించిన అధికారులు సుడా పరిధిలో ఉన్న చెంజర్ల గ్రామ రైతులకు రూ.63వేలు చెల్లించారని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి పనులను అడ్డుకోవడంతో ఆర్డీవో మహేశ్వర్, తహశీల్దార్ విజయ్‌కుమార్, సీఐలు సంజీవ్, సదన్‌కుమార్‌తో పాటు పోలీసులు అక్కడికి చేరుకున్నారు. తనకు న్యాయం జరిగేంత వరకు పనులు చేయనివ్వనని అడ్డుకున్నాడు దీంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం అధికారులు పనులను కొనసాగించారు.

పట్టా రద్దు చేయాలని కలెక్టర్‌కు వృద్ధురాలి ఫిర్యాదు


ఫిర్యాదు కాపీ చూపుతున్న శాంతమ్మ

శంకరపట్నం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మోసపూరితంగా భూమిని పట్టా చేసుకున్నారని ఆ వ్యక్తి రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని కన్నాపూర్ గ్రామానికి చెందిన చింతిరెడ్డి కాంతమ్మ కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. బాధితురాలు చింతిరెడ్డి శాంతమ్మ మంగళవారం విలేకరుల ఎదుట తమ గోడు వెళ్లబోసుకుంది. శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామానికి చెందిన చింతిరెడ్డి శాంతమ్మ-పుల్లారెడ్డిలకు సంతానం లేకపోవడంతో దగ్గరి బంధువైన గూడెపు సంతోష్‌రెడ్డి జీవితాంతం మిమ్మల్ని కంటికి రెప్పలా చూసుకుంటామని వృద్ధాప్యంలో అండగా ఉంటానని నమ్మబలికించాడు. అతని మాటలు నమ్మి రిజిస్ట్రేషన్ చేశామని శాంతమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా తమకు డబ్బులు ఇవ్వకుండా, డబ్బులు ఇచ్చి కొనుగోలు చేసినట్లు డాక్యుమెంట్ తయారు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని ఆరోపించారు. కాగా కొన్నేళ్ల క్రితం తన భర్త పుల్లారెడ్డి మరణించగా, ఒంటరిగా ఉంటున్న శాంతమ్మ ఆలనాపాలన చూసుకోకుండా తమ ఏడెకరాల భూమిని సంతోష్‌రెడ్డి తన పేరిట పట్టా చేయించుకున్నాడని దానిని రద్దు చేయాలన్నారు.

ముగ్గురి బైండోవర్

కరీంనగర్ క్రైం, జూలై 1(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తున్న కేసులో దర్శనాల లక్ష్మణ్, నాగపురి శ్రీనివాస్, దాసరి వినయ్‌కుమార్‌ను బైండోవర్ చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ముగ్గురిని మంగళవారం కరీంనగర్ రూరల్ తహసీల్దార్ ఎదుట హాజరుపర్చినట్లు, సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

● తీగలగుట్టపల్లిలో తానిపర్తి శ్రీధర్‌రావు, కేసరి సంపత్‌కుమార్‌లు అనుమానాస్పదంగా తిరుగూ కనిపించగా వారిని అదుపులోకి తీసుకుని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

పోక్సో కేసులో 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

సుల్తానాబాద్, జూలై 1 (ఆంధ్రజోతి): పెళ్లి పేరుతో యువతిని లోబరుచుకుని కిడ్నాప్ చేసి వేరే ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారం చేసిన నేరస్థుడికి పెద్దపల్లి ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ కోర్టు జడ్జి సునిత పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రెండు వేల రూపాయల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చారు. సుల్తానాబాద్ ఎస్‌ఐ శ్రావణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తానాబాద్ పట్టణానికి చెందిన ఓ యువతి ఇంటర్ పూర్తి చేసి ఓ ఫ్యాక్టరీలో పనికి వెళుతోంది. రోజూ ఫ్యాక్టరీకి వెళ్తున్న క్రమంలో షేక్ అన్వర్ అలియాస్ కట్ట అన్వర్ ప్రేమిస్తున్నానంటూ యువతి వెంటపడ్డాడు. విషయాన్ని యువతి తల్లికి తెలుపగా కూతురుకు సర్దిచెప్పింది. 2018లో యువతి తల్లి పనికి వెళ్లగా ఇదే అదనుగా భావించిన అన్వర్ యువతి ఇంటికి వెళ్లి ఆటోలో పెద్దపల్లికి అక్కడి నుంచి రైలులో కాగజ్‌నగర్ తీసుకువెళ్లాడు. అక్కడ అన్వర్‌కు తెలిసిన ఒకరి ఇంటిలో యువతితో ఉన్నాడు. పెళ్లి చేసుకుంటానంటూ యువతిని లోబరుచుకున్నాడు. పెళ్లి విషయం దాటవేస్తుండడంతో వారం రోజుల అనంతరం యువతి తల్లికి సమాచారం ఇచ్చింది. తల్లి కాగజ్‌నగర్‌కు చేరుకుని కూతురును తీసుకుని జరిగిన అన్యాయం గురించి పోలీసులను ఆశ్రయించింది. అప్పటి ఎస్‌ఐ రాజేశ్ కేసు నమోదు చేయగా ఏసీపీ హబీబ్‌ఖాన్ దర్యాప్తు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ చేశారు. పెద్దపల్లి ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ జరుగగా ఇరుపక్షాల వాదనలు విన్న జడ్జి సునిత నేరస్థుడు షేక్ అన్వర్‌పై నేరం రుజువు కావడంతో పది సంవత్సరాల కఠిన కారాగార శిక్షతోపాటు రెండు వేల జరిమానా విధించారు. శిక్షపడడంలో పీపీ బాదం రమేష్, పోలీసులు కీలకపాత్ర పోషించారని సీపీ అభినందించారు.

వృద్ధుడి ఆత్మహత్య

జగిత్యాలరూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి గ్రామానికి చెందిన మద్రిపెల్లి చిన్న అంజయ్య (84)అనే వృద్ధుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. చిన్న అంజయ్య కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలు, మానసిక సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం తన వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య మద్రిపల్లి దుబ్బరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇంటలిజెన్స్ డీఎస్పీ గౌస్‌బాబాకు ఏఎస్పీగా పదోన్నతి

కరీంనగర్ క్రైం, జూలై 1(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఇంటలిజెన్స్ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న గౌస్‌బాబాకు అడిషనల్ ఏఎస్పీగా పదోన్నతి కల్పించారు. కరీంనగర్ ఇంటిలిజెన్స్ ఏఎస్పీ పోస్ట్ కొంత కాలంగా ఖాళీగా ఉండడంతో గౌస్‌బాబా ఇప్పటి వరకు ఇన్‌చార్జిగా విధులు నిర్వహించారు. ఇప్పుడు గౌస్‌బాబాను కరీంనగర్ అడిషనల్ ఎస్పీగా పూర్తిస్థాయి చార్జిని అప్పగిస్తూ నియామక ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా గౌస్‌బాబాను మంగళవారం ఇంటలిజెన్స్ కరీంనగర్ కార్యాలయంలో టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మన్‌రావు, గూడ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు హర్మిందర్‌సింగ్, రామస్వామి సన్మానించారు.

● జిల్లాకు బదిలీపై వచ్చిన 16 మంది హెడ్‌కానిస్టేబుళ్లు

రాజన్న జోన్-3లో ప్రస్తుతం పని చేస్తున్న హెడ్‌కానిస్టేబుళ్లు 16 మంది కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. కరీంనగర్ కమిషనరేట్‌లో కానిస్టేబుళ్లుగా పనిచేసి కొంత కాలం కిందట హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొంది ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లారు. కమిషనరేట్‌లో ప్రస్తుతం ఖాళీగా ఉన్న పోస్టులకు వీరిని జిల్లాకు బదిలీ చేశారు.

ఆన్‌లైన్ గేమ్స్ ఆడవద్దని తల్లిదండ్రుల మందలింపు

● ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు ● చికిత్స పొందుతూ మృతి


అజయ్ (ఫైల్)

కమాన్‌పూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల కేంద్రం శివారు పిల్లిపల్లెకు చెందిన అజయ్(24) ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటుపడ్డాడు. ఆడవద్దని తల్లిదండ్రులు మందలించడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పిల్లి అజయ్ హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నాడు. సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతూ లక్షల రూపాయలు నష్టపోయాడు. తల్లిదండ్రులు వద్దని వారిస్తే రెండేళ్ల క్రితం ఇంటినుంచి వెళ్లిపోయాడు. అతన్ని ఇంటికి తీసుకురాగా మళ్లీ ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతుండటంతో వద్దని మందలించారు. దీంతో గత నెల 29న గుండారం-రాజాపూర్ శివారులో గడ్డి మందు తాగి స్నేహితులకు ఫోన్‌చేసి చెప్పాడు. అజయ్ కుటుంబ సభ్యులు హుటాహుటిన పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. అజయ్ తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పండ్ల ఆటో బోల్తా


రోడ్డుపై పడిపోయిన పండ్లు

కోరుట్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల పట్టణంలోని జాతీయ రహదారిపై మంగళవారం అల్‌బుకార్ పండ్లు తరలిస్తున్న ఆటో బోల్తా పడింది. పట్టణంలోని అయిలాపూర్ ఎక్స్‌రోడ్డు నుంచి జాతీయ రహదారిపైకి అతి వేగంగా డ్రైవర్ ఆటోను నడపడంతో అదుపుతప్పి బోల్తా కొట్టింది. పండ్లు కింద పడిపోవడంతో స్థానిక వ్యాపారులు సహాయం చేసి పండ్లను పెట్టెలలో ఎత్తారు. సంఘటనలో ఆటో పూర్తిగా ధ్వంసం కాగా డ్రైవర్‌కు గాయాలయ్యాయి.


రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో జిల్లాకు పతకాలు


పతకాలు సాధించిన విద్యార్థులు

సిరిసిల్ల టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జూన్ 28, 29న జరిగిన రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో రాజన్న సిరిసిల్ల జిల్లాకు పతకాలు వచ్చాయి. రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలలో బంగారు, వెండి, కాంస్య పతకాలను సాధించిన జిల్లా విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు మంగళవారం సిరిసిల్లలో కిక్ బాక్సింగ్ కోచ్ వొడ్నాల శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా నుంచి 20 మంది విద్యార్థులు వెళ్లగా కిక్ బాక్సింగ్ పలు విభాగాలలో బంగారు, వెండి, కాంస్య పతకాలను సాధించారు. ఎలగందుల శ్రీనివాస్, గంగనవేణి ప్రవళిక, అన్నాల్‌దాస్ లక్ష్మిప్రసన్న, బోయిన లోకేష్, ఏర్నాల రాజశేఖర్, గజ్జెల శ్వేదిక, కర్నె యతిక, గౌతమ్, ఆనందర్, శివష్, కొండ శ్రీరామ్, గజ్జెల హిరణ్య, షేక్ అజహన్‌లు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన్నట్లు పేర్కొన్నారు.

తమిళనాడు రాష్ట్రం చెన్నయ్‌లో జరగనున్న జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలలో ఎంపికైన జిల్లా విద్యార్థులు పాల్గొంటారని వారు తెలిపారు.

జీతాలు ఇవ్వండి మహాప్రభో




కరీంనగర్ కల్చరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో ధూపదీప, నైవేద్య పథకం కింద (డీడీఎన్) పనిచేసే దేవాలయాల అర్చకులకు మార్చి, ఏప్రిల్‌తో పాటు జూన్ మాసాన్ని కలుపుకుంటే మూడు నెలలుగా జీతాలు రాలేదు. దీంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అర్చకులకు గౌరవ భృతి కింద రూ.6 వేలు, ధూపదీపాలు, హారతి, నైవేద్యానికి రూ.4 వేల చొప్పున మొత్తం 10 వేలు చెల్లిస్తుండగా ఇప్పటివరకు అకౌంట్‌లలో జమ కాలేదు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో 898 ఆలయాల అర్చకులు జీతాల కోసం ఎదురు చూస్తున్నారు. ఉదయం, సాయంత్రం పూజలు, పునస్కారాలతో ఆలయాలనే నమ్ముకొని బతుకుతున్న వారికి నిత్యం పూట గడవడం కష్టంగా ఉంది. చిన్నచిన్న ఆలయాలకు భక్తుల తాకిడి తక్కువగా ఉండడంతో దేవుడి కైంకర్యాలకు అంతరాయం ఏర్పడుతోంది. విశేష రోజులు, ఉత్సవాలు, పండుగలు వస్తే ధూపదీప నైవేద్యాలకు మరింత ఖర్చు చేయాల్సి వస్తుంది. ఒక వేళ దాతలు, గ్రామ పెద్దలు సహాయం చేస్తే తప్ప ధూప దీప నైవేద్యాలు గడిచే పరిస్థితి. గుడినే నమ్ముకున్న అర్చకులు కూలీ చేయలేక, కుటుంబ అవసరాలకోసం అప్పులు కూడా చేస్తున్నట్లు సమాచారం.

నెలల తరబడి వేతనాలు రాకపోవడంతో నిత్యావసర సరుకులతో పాటు పిల్లల పుస్త కాలు, ఫీజులు చెల్లించేందుకు, రోగాలకు మందులు కొనుక్కునేందుకు అవస్థలు పడుతున్నారు. కనీసం శుభ కార్యాలతోనైనా వెళ్లదీద్దామనుకుంటే రెండు నెలలుగా ముహూర్తాలు లేవు. ప్రస్తుతం ఆషాడమాసం నడుస్తోంది. దీంతో ఈ ఆధారం కూడా లేకుండా పోయింది. ప్రభుత్వాలు మారినా వేతనాల చెల్లింపుల విషయంలో ప్రతీసారి ఇదే పరిస్థితి నెలకొంటోది. ఆలస్యానికి కారణమడిగితే అధికారులు బడ్జెట్ రాలేదని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డీడీఎన్ కింద తొలుత ప్రభుత్వం రూ.2500 చెల్లించేది. ఆ తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.6వేలకు, తర్వాత రూ.10వేలకు పెంచింది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.12 వేలకు పెంచుతామని ఎన్నికలకు ముందు ప్రకటించింది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా ఆ ఊసే లేదు. వేతనాలు పెంచాలని, సకాలంలో అందించాలని అర్చక సంఘాల నాయకులు ప్రభుత్వానికి పలు మార్లు విజ్ఞప్తి చేసినా, వినతి పత్రాలు సమర్పించినా స్పందన లేదు. ఇప్పటికైనా వేతన పెంపుతోపాటు సకాలంలో జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని, తమ కుటుంబాలను ఆదుకోవాలని అర్చకులు కోరుతున్నారు.

పెద్ద ఆలయాల నుంచి కంట్రిబ్యూషన్ రావాలి

గంగు ఉపేంద్రశర్మ, రాష్ట్ర అర్చక, ఉద్యోగ జేఏసీ చైర్మన్



పెద్ద ఆలయాల నుంచి కంట్రిబ్యూషన్ వస్తే చిన్న ఆలయాల అర్చకులకు వేతనాలు చెల్లించాలని నిర్ణయించారు. ఏటా రూ.26 కోట్ల బడ్జెట్ అర్చక వెల్ఫేర్ అసోసియేషన్‌కు రావాలి. వేతనాలు ప్రస్తుతం ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌తో ముడి పడి ఉన్నాయి. జిల్లాల అధికారులు ప్రతీ నెలా 20వ తేదీ లోపు బిల్లులు పంపాలి. త్వరలో వేతనాలు వస్తాయి.

అర్చకులకు ఇబ్బంది: నిట్టూరి సతీశ్‌శర్మ, డీడీఎన్ అర్చక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు



వేతనాలు సకాలంలో అందకపోతే అర్చకులకు అనేక ఇబ్బందులు తప్పవు. సంఘం తరపున దేవాదాయశాఖ మంత్రి, అధికారులను కలిశాం. ఫైనాన్స్ కమిషన్ నుంచి ఉత్తర్వులు రాగానే వేతనాలు పడతాయని చెప్పారు. ప్రతీ నెలా వేతనాలు అందేలా నాయకులు, అధికారులతో మాట్లాడుతాం. అర్చకుల అవస్థలపై వివరించే ప్రయత్నం చేస్తాం.

శతాధిక వృద్ధురాలు మృతి


రాజవ్వ (ఫైల్)

చందుర్తి జూలై 1 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో గసిగంటి రాజవ్వ(110) అనే శతాధిక వృద్ధురాలు మృతిచెందింది. గ్రామస్థుల కథనం ప్రకారం... రాజవ్వ రెండు రోజుల నుంచి అనారోగ్యానికి గురై సోమవారం రాత్రి మృతిచెందినట్లు తెలిపారు. రాజవ్వకు నలుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు, 19 మంది మనవళ్లు, మనవరాళ్లు ఉన్నారు. ఇప్పటి వరకు రాజవ్వ ఆమె పనులు ఆమె చేసుకుంటూ ఉండేదని కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపారు. రాజవ్వ నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు మృతిచెందినట్లు పేర్కొన్నారు. ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్న కుమార్తె అంత్యక్రియలు నిర్వహించారు.

యువతి అదృశ్యం

తంగళ్లపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ఇందిరానగర్‌కు చెందిన మోతే రాధిక అనే యువతి సోమవారం అదృశ్యమైంది. ఇందిరనగర్‌కు చెందిన మోతే రేణుక-కనకయ్యల కూతురు రాధిక సోమవారం సాయంత్రం నుంచి కనిపించకుండా పోయిందని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఉపేంద్ర చారి తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

ధర్మపురి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణానికి చెందిన కటుకం భూమయ్య అనే యువకుడు గత నెల 8న తన సెల్‌ఫోన్ పోగొట్టుకోగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ధర్మపురి పోలీసులు వెంటనే వివరాలు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేశారు. సెల్‌ఫోన్ ఆచూకీ తెలుసుకుని భూమయ్యకు అప్పగించినట్లు హెడ్‌కానిస్టేబుల్ పులి రవికుమార్ తెలిపారు.

తెరుచుకున్న బాబ్లీ గేట్లు

ఎస్సారెస్పీకి పెరగనున్న వరద



బాబ్లీ గేట్లు ఎత్తడంతో వస్తున్న వరద నీరు

జగిత్యాల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రంలో గోదావరి నదిపై గల బాబ్లీ ప్రాజెక్టు గేట్లు తెరుచుకున్నాయి. మంగళవారం బాబ్లీ ప్రాజెక్టు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు అధికారుల సమక్షంలో బాబ్లీ ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో గోదావరి నదిపై మహారాష్ట్ర సర్కారు నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం జూలై 1వ తేదీ నుంచి ఎత్తి నీటిని వదిలారు. నాలుగు నెలల పాటు బాబ్లీ ప్రాజెక్టు గేట్లు తెరుచుకొని ఉంచి వచ్చిన నీరును వచ్చినట్లుగానే దిగువలోకి వదలనుండడంతో రానున్న రోజుల్లో ఎస్సారెస్పీలోకి వరద నీరు వచ్చి చేరనుంది. అక్టోబరు 28 వరకు బాబ్లీ గేట్లను ఎత్తి ఉంచనున్నారు. బాబ్లీ గేట్లు తెరుచుకునే పనులను పరిశీలించడానికి ఎస్సారెస్పీ అధికారుల బృందం మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టును సందర్శించింది. బాబ్లీని సందర్శించిన అధికారుల బృందంలో సీడబ్ల్యూసీ ఈఈ ఎంఎల్ ఫ్రాంక్లిన్, పోచంపాడ్ ఎస్ఈ శ్రీనివాస్ గుప్త, ఈఈ చక్రపాణి, నాందేడ్ బాబ్లీ ఈఈ బాన్సోడ్, పోచంపాడ్ ఏఈఈ కొత్త రవి, పలువురు బాబ్లీ డ్యామ్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు అధికారులు తదితరులున్నారు.

సహకార సంఘాల సేవలను సద్వినియోగం చేసుకోవాలి

చొప్పదండి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సహకార సఘాలను సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహకార శాఖ అధికారి రామానుజచార్యులు అన్నారు. మంగళవారం చొప్పదండి ప్యాక్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ సహకార వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 సంవత్సరాన్ని ఐక్యరాజ్య సమితి సహకార సంవత్సరంగా గుర్తించడం శుభపరిణామమని అన్నారు. సహకార సంఘాల అవసరాన్ని విస్తృతంగా రైతులకు చేరవేయాలని, సంఘం ద్వారా రైతులకు కావాల్సిన స్వల్ప కాలిక, దీర్ఘకాలిక రుణాలను, ఎరువులను, పురుగు మందులను సకాలంలో అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, క్రిబ్‌కో కంపెనీ జిల్లా మేనేజర్ ప్రేమ్ తేజ్, ఏరియా మేనేజర్ నవీన్ కుమార్, సంఘం ఉపాధ్యక్షులు ముద్దం మహేశ్‌గౌడ్, సీఈవో కళ్లెం తిరుపతిరెడ్డి, డైరెక్టర్లు కళ్లెం లక్ష్మారెడ్డి గుర్రం ఆనందరెడ్డి, మంగళారపు మల్లారెడ్డి, నాంపల్లి మల్లయ్య, మాజీ సహకార అధికారి గుర్రం ఇంద్రసేనారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో పతకాలు



పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్

కరీంనగర్ స్పోర్ట్స్/ చొప్పదండి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో జూన్ 23, 24, 25 తేదీల్లో నిర్వహించిన జాతీయ స్థాయి జూనియర్స్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు పతకాలను సాధించినట్లు ఉమ్మడి జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మెహర్, సంతోష్ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు మొత్తం ఏడు స్వర్ణం, ఒక రజత పతకం సాధించినట్లు పేర్కొన్నారు. క్రీడాకారులను జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్ అభినందించారు. భవిష్యత్‌లో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో తైక్వాండో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పెండ్లి రాజేశం, కోచ్ హరి, శ్రీజ, రమ్య, నాగమణి, అంజలి పాల్గొన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఏఆర్ కానిస్టేబుల్



కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి మహిళల హ్యాండ్‌బాల్ పోటీలకు ఏఆర్ కానిస్టేబుల్ మాధవి ఎంపికయ్యారని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్ తెలిపారు. రామగుండం కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న మాధవి రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు చెప్పారు. గుజరాత్‌లోని భుజ్‌లో ఈ పోటీలు జరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా మాధవిని సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్యామల పవన్ కుమార్, డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి అభినందించారు.

రైతుల కోసం పలు యాప్‌లు



- వర్షాలపై ముందస్తు సమాచారం
- ఎప్పటికప్పుడు వాతావరణ వివరాల అందజేత

చొప్పదండి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వర్షాలు ఎప్పుడుపడతాయో, వాతావరణం ఎప్పుడు మారుతుందో రైతులకు తెలియక నష్టపోతున్నారు. వరుణుడి కోసం ఎదురుచూస్తూ పంటల సాగును చేపడుతున్నారు. ముందస్తు వాతావరణ సూచనలు, సలహాలు తెలియక అకాల వర్షాలు, భారీ వర్షాలు కొన్ని సందర్భాల్లో పంటలను దెబ్బతీస్తున్నాయి. పిడుగులు పడి వ్యవసాయ పనులకు వెళ్లిన రైతులు మృత్యువాత పడుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులకు సకాలంలో వాతావరణ సూచనలు, వర్షాలు, పిడుగుల సమాచారం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ మంత్రిత్వ శాఖతోపాటు ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వ శాఖలు ఐఎండీ, ఐకార్ సహకారంతో పలు యాప్‌లను రూపొందించింది. మేఘదూత్, కిసాన్ సువిధ, రెయిన్ అలారం, దామిని యాప్‌లను రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ యాప్‌ల ద్వారా రైతులకు ఎప్పటికప్పుడు వాతావరణ సమాచారం తెలుసుకోవచ్చు. కొన్ని యాప్‌లు ముందస్తు సమాచారాన్ని కూడా అందిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రైతుల కోసం ప్రత్యేక కథనం...

సమాచారం తెలుగులోనూ అందుబాటులో ఉంది..



వంశీకృష్ణ, మండల వ్యవసాయ అధికారి, చొప్పదండి

రైతులు పంటలు సాగు చేసే సమయంలో వాతావరణ సమాచారం ఎంతో అవసరం. వాతావరణ వివరాలను తెలిపే యాప్‌లను సద్వినియోగం చేసుకోవాలి. ఈ యాప్‌లలో సమాచారం తెలుగులోనూ అందుబాటులో ఉంది.

● మేఘదూత్‌తో నాలుగు రోజుల ముందే సమాచారం...



మేఘదూత్ యాప్‌లో రానున్న నాలుగు రోజుల వాతావరణ సమాచారాన్ని రైతులు ముందే తెలుసుకోవచ్చు. ఈ యాప్‌లో వారం క్రితం నాటి సమాచారంతోపాటు ప్రస్తుత సమయంలో ఉష్ణోగ్రత, వర్షపాతం, గాలి వేగం సమాచారాన్ని యాప్ ద్వారా పొందవచ్చు. ఇతర ప్రాంతాలకు ప్రయాణం చేసే వారు కూడా ఈ యాప్ ద్వారా ముందస్తు సమాచారాన్ని తెలుసుకోవచ్చు.

● వర్ష సూచనకు రెయిన్ అలారం, కిసాన్ సువిధ



వివిధ ప్రాంతాల్లో వర్ష సూచనలను నిరంతరం తెలుసుకునేందుకు రెయిన్ అలారం, కిసాన్ సువిధ యాప్‌ల ద్వారా తెలుసుకునే అవకాశం ఉంది. ఐదు రోజుల ముందస్తు హెచ్చరికలను ఈ యాప్‌లో అందుబాటులో ఉన్నాయి. వాతావరణంతోపాటు మార్కెట్ ధరలు, పంటల బీమా సమాచారం, విత్తనాలు, ఎరువులు, నీటి నిర్వహణపై పలు సూచనలు ఈ యాప్‌లలో రైతులకు అందుబాటులో ఉన్నాయి. అన్ని భాషలతోపాటు తెలుగులో కూడా ఈ యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. ఈ యాప్‌లను రైతులు ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

● దామిని ద్వారా పిడుగుల సమాచారం..



ఉరుములు, మెరుపులు, పిడుగులకు సంబంధిం చిన సమాచారాన్ని దామిని యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. పిడుగులు ఎక్కడ పడే అవకాశం ఉందో ఈ యాప్ సమాచారం అందిస్తుంది. పిడుగు పడే సమ యంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకుని రక్షణ పొందవచ్చు. పిడుగు పడే వాతావరణం ఉన్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఈ యాప్‌లో అందు బాటులో ఉంటాయి.

అంజన్న సన్నిధిలో భక్తుల సందడి



ఆలయ ఆవరణలో భక్తులు

మల్యాల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో మంగళవారం భక్తుల సందడి నెలకొంది. వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అంజన్నతో పాటు బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. వేకువ జాము నుంచి కురిసిన ముసురు వర్షం భక్తులకు అసౌకర్యం కలిగించింది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు పర్యవేక్షించారు.

భాషా సాంస్కృతిక శాఖ సలహాదారుల కమిటీ సభ్యుడిగా కిశోర్



హుజూరాబాద్, జూలై 1(ఆంధ్రజ్యోతి): హుజూ రాబాద్ పట్టణానికి చెందిన నేర్నాల కిశోర్‌ను తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సలహాదారుల కమిటీ సభ్యుడిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కిశోర్ నియామకం పట్ల హుజూ రాబాద్ నగారే బృందం చొల్లేటి రాజన్న, పిట్టల శ్రీనివాస్, మురళీ మధు, వడ్లకొండ అనిల్, బాబ్జీ, డప్పు సురేష్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

బోడకాకర కిలో రూ.400



(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ఎన్నో పోషకాలు, కావాల్సినన్ని విటమిన్లు అందించే బోడకాకర ధర కూడా భయపెడుతోంది. మంగళవారం సిరిసిల్ల మార్కెట్‌లో కిలో రూ.400 ధర పలికింది. వర్షాకాలంలో మాత్రమే కనిపించే బోడకాకర చాలా తక్కువగా మార్కెట్‌లోకి వస్తుంటుంది. దీంతో ఎక్కువ ధర అయినా ప్రజలు కొనడానికి ముందుకు వస్తారు. గతేడాది ఇదే సీజన్‌లో రూ.200 కిలో ఉన్న బోడకాకర ఈ ఏడాది రూ 400లకు చేరడంతో కొనాలని ఉన్నా ధరలు భయపెడుతున్నాయి.

ఔషధ గుణాలు ఎన్నో..

బొంతకాకర, అడవికాకర, అగాకార పేర్లతో పిలిచే బోడకాకరలో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. ఇందులో బీ1, బీ2, బీ3, బీ5, బీ6, బీ9, బీ 12 విటమిన్‌లతో పాటు ఏ, సీ, డీ2, డీ3, కాల్షియం, మెగ్నీషియం, పోటాషియం, సోడియం, విటమిన్ హెచ్, కే, కార్బోహైడ్రేట్లు, ఫైబర్, కాపర్, జింక్ ప్రొటీన్‌లు ఉన్నాయి.

బోడకాకర తలనొప్పి, జుట్టు రాలడం, చెవినొప్పి, దగ్గు, కడుపులో ఇన్‌ఫెక్షన్లు రాకుండా చూస్తుంది. డయాబెటిక్ రోగులకు ఎంతో ఉపయోగ కరంగా ఉంటుంది. వర్షాకాలంలో వచ్చే ఎలర్జీని కూడా దూరం చేస్తుంది. పక్షవాతం, కంటి సమస్యలు, రక్తపోటు, క్యాన్సర్, కిడ్నీలో రాళ్లు రాకుండా కూడా దోహదపడుతుంది. గర్భిణులు బోడకాకర తింటే శిశువు ఎదుగుదలకు కూడా ఉపయోగపడుతుందని వైద్యులు చెబుతున్నారు.

ఆశ్రమ పాఠశాలకు ఆదరణ కరువు

అన్ని వసతులున్నా పిల్లలను చేర్పించని తల్లి దండ్రులు



చిత్రవేణిగూడెం బాలుర ఆశ్రమ పాఠశాల

బీర్‌పూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్రవేణి గూడెం బాలుర ఆశ్రమ పాఠశాలకు ఆదరణ కరువైంది. ఈ పాఠశాలలో మూడో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు చదువుకునే విద్యార్థులు 40 మంది ఉన్నారు. ప్రధానోపాధ్యాయుడు, ముగ్గురు సీఆర్‌టీలు, ముగ్గురు వాలంటీర్లు ఉన్నారు. ఈ పాఠశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నాయి. అయినా మండలంలోని గిరిజన విద్యార్థులు పాఠశాలలో చేరడం లేదు. మండలంలో రంగాసాగర్, చెర్లపల్లి, కండ్లపల్లి, మంగేళ, తాళ్లధర్మారం, చిత్రవేణిగూడెం, చిన్న కొల్వాయి, తుంగూర్, కోమన్‌పల్లి, కందెనకుంట, బీర్‌పూర్, సారంగాపూర్ మండలంలో బట్టపల్లి-పోతారం, సారంగా పూర్, రేచపల్లి, లక్ష్మీదేవిపల్లి, అర్పపల్లి గ్రామాల్లో గిరిజన విద్యార్థులు ఉన్నారు. అధికారులు ఆశ్రమ పాఠశాల గురించి అవగాహన కల్పించకపోవడంతో విద్యార్థులు చేరడం లేదు. సమీపంలో అన్ని వసతులతో కూడిన ఆశ్రమ పాఠశాలలు ఉండగా దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకుంటున్నారు.

అడ్మిషన్ల కోసం ఉపాధ్యాయుల తిప్పలు

స్థానిక విద్యార్థులు చేరకపోవడంతో ఆశ్రమ పాఠశాల సిబ్బంది పొరుగు జిల్లాలైన ఆదిలాబాద్, మంచిర్యాల ప్రాంతాల కు చెందిన విద్యార్థులను చేర్చుకుంటున్నారు. అధికారులు స్పందించి మండలంలోని మంగేళ గ్రామంలో ఉన్న బాలికల గిరిజన పాఠశాలపై, చిత్రవేణి గూడెంలో ఉన్న బాలుర ఆశ్రమ పాఠశాలపై గిరిజనుకు అవగాహన కల్పించి విద్యార్థులను చేర్పించేందుకు కృషి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను చేర్పించాలి



శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు

ఆశ్రమ పాఠశాలను తల్లిదండ్రులు ఒక్క సారి సందర్శించి పాఠశాలలో వసతులు, ఆహారాన్ని, పరిసర ప్రాంతాలను పరిశీలించాలి. అన్ని సౌకర్యాలు ఉన్నాయి. విద్యార్థులకు మంచి విద్యను అందిస్తున్నాం. తల్లిదండ్రులు తమ పిల్లలను ఆశ్రమ పాఠశాలలో చేర్పించాలి.

నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలి

జ్యోతినగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ అధికారులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని రామగుండం ఎన్టీపీసీ ఈడీ చందన్ కుమార్ సామంత అన్నారు. మంగళవారం ఈడీసీ మిలీనియం హాల్‌లో అధికారులకు మొదటిసారి కృత్రిమ మేథస్సుపై వర్క్‌షాప్ నిర్వ హించారు. వర్క్‌షాప్‌ను ప్రారంభించిన అనంతరం ఈడీ ప్రసంగిస్తూ సిబ్బంది ఎప్పటికప్పుడు తమను తాము అప్‌గ్రేడ్ చేసుకోవాల్సిన అ వసరం ఉందన్నారు. ఏఐ సాంకేతిక పరిజ్ఞానం తమ రోజువారి వృత్తిలో ఎంతో ఉపక రిస్తుందని తెలిపారు. సోషల్ మీడియా కన్సల్టెంట్, డిజిట్ మార్కెటింగ్ ప్రొఫెసర్ కిరుబా శంకర్ కృత్రిమ మేథస్సు ప్రాధాన్యం, ఆచరణ, ప్రయోజనాలు



ఏఐ వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఎన్టీపీసీ అధికారులు

తదితర అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఏఐతో కమ్యూనికేషన్ రంగంలో వచ్చే విప్లవాత్మక మార్పులపై వివరించారు. వర్క్‌షాప్‌లో జీఎం మనోజ్ ఝా, ఏజీఎం హెచ్‌ఆర్ విజయ్‌కుమార్ సిక్దర్, అధికారులు, కమ్యూనికేషన్ అధికారులు(పీఆర్), సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీపీసీ జీఎంకు సీజీఎంగా పదోన్నతి

ఎన్టీపీసీ ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ జీఎం అలోక్‌కుమార్ త్రిపాఠికి పదోన్నతి లభించింది. త్రిపాఠికి చీఫ్ జనరల్ మేనేజర్(సీజీఎం)గా ప్రమోషన్ కల్పిస్తూ మంగళవారం కార్పొరేట్ సెంటర్ ఉత్తర్వులు జారీ చేసింది. పదోన్నతి లభించినప్పటికీ ఆయన ఇక్కడి ప్రాజెక్టులోనే పని చేయనున్నారు.

ప్రమాదకరంగా లో లెవెల్ వంతెనలు



అర్కండ్ల లో లెవెల్ బ్రిడ్జిపై ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు (ఫైల్)



అర్కండ్లలోని లెవెల్ బ్రిడ్జి

శంకరపట్నం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల గడుస్తున్నాయి.. ప్రభుత్వాలు మారుతున్నాయి.. సమస్యలపై ప్రజలు, ప్రభుత్వ యంత్రాంగానికి విన్నవిస్తున్నారు. కానీ సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. వర్షాకాలంలో వాగులు ఉప్పొంగిలో లెవల్ బ్రిడ్జిల పైనుంచి నీరు ప్రవహించడంతో వాగు దాటాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వాగు ఉప్పొంగినపుడు తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. వాగులపై బ్రిడ్జిలు నిర్మించాలని ప్రజలు ఏళ్లుగా కోరుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు.

అర్కండ్ల బ్రిడ్జిపై అవస్థలు

శంకరపట్నం మండలం అర్కండ్ల-కన్నాపూర్ గ్రామాల మధ్య అర్కండ్ల వాగుపై ఉన్న లో లెవెల్ బ్రిడ్జి వర్షాకాలంలో భారీ వర్షాలు కురిసినప్పుడు ప్రమాదకరంగా మారుతుంది. వర్షాకాలంలో బ్రిడ్జిపై నుంచి నెలల తరబడి నీరు ప్రవహిస్తూ ఉంటుంది. అర్కండ్ల గ్రామ ప్రజలు వ్యవసాయ పనుల నిమిత్తం ప్రతిరోజు బ్రిడ్జి దాటి రావాల్సి ఉంటుంది. భారీ వర్షాలు కురిసినప్పుడు బ్రిడ్జిపై నీరు ఉధృతంగా ప్రవహించడంతో గ్రామస్థులు కొన్ని రోజుల పాటు పొలాల వద్దకు రావడానికి అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. అంతేకాక వీణవంక మండలం చల్లూరు నుంచి శంకరపట్నం మండలం కేశవపట్నం ఎన్‌హెచ్-563 రహదారి వరకు 13 కిలో మీటర్ల మేర రూ. 17 కోట్లతో బ్రిడ్జి మీద గుండా బీటీ రోడ్డు నిర్మించారు.

వీణవంక మండలంలోని పలు గ్రామాలు ఈ దారి మీదుగా కేశవపట్నం చేరుకోవడానికి అనువుగా ఉంటుంది. వర్షాకాలం వస్తే అర్కండ్లలో లెవెల్ బ్రిడ్జిపై నుంచి నీరు ప్రవహించడంతో భారీ వాహనాలు తప్ప చిన్న వాహనాల రాకపోకలకు నెలల తరబడి అంతరాయం ఏర్పడుతుంది. వర్షాకాలంలో బ్రిడ్జిపై నాచు పట్టి జారే స్వభావం కలిగి ఉండడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడిన ఘటనలున్నాయి. చల్లూరు నుంచి కేశవపట్నం జాతీయ రహదారి వరకు రూ. 17 కోట్లతో రోడ్డు నిర్మించారు. కానీ అర్కండ్ల వాగుపై బ్రిడ్జి నిర్మించకపోవడంతో వర్షాకాలంలో రాకపోకలకు అంతరాయం కలుగుతుందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చొరవ తీసుకొని అర్కండ్ల వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



పాపయ్యపల్లె నుంచి కేశవపట్నం వెళ్లే లో లెవెల్ బ్రిడ్జి (ఫైల్)

పాపయ్యపల్లె లో లెవెల్ బ్రిడ్జి

కేశవపట్నం గ్రామపంచాయతీ పరిధిలోని పాపయ్యపల్లె గ్రామానికి వెళ్లే దారిలో వాగుపై లో లెవెల్ బ్రిడ్జి నిర్మించారు. వర్షాకాలంలో భారీ వర్షాలు కురిసినప్పుడు బ్రిడ్జిపై నుంచి నీరు ప్రవహించడంతో మండల కేంద్రంతో పాటు కేశవపట్నం గ్రామపంచాయతీకి రాకపోకలు నిలిచిపోతాయి. అంతేకాక గ్రామపంచాయతీకి రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న పాపయ్యపల్లెకు సరైన రోడ్డు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాపయ్యపల్లె గ్రామానికి బ్రిడ్జితో పాటు బీటీ రోడ్డు వేసి సమస్యలు తీర్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వరండాలోనే చదువులు.. పట్టించుకోని అధికారులు..

వీర్నపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండలం బాప్‌సింగ్ నాయక్ తండా ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 27మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలో బోధించేందుకు ఒకే ఒక్క టీచర్ ఉండటంతో పాఠశాల గదిలో రెండు తరగతులు, గది బయట వరండాలో మూడు తరగతులకు ఒకే చోట బోధిస్తున్నారు. వరండాలో కూర్చొని చదువుతుండటంతో ముసురు వానకు విద్యార్థులు వణుకుతున్నారు. కనీసం కూర్చునేందుకు బెంచీలు కూడా కరువయ్యాయి. 11 మంది కంటే ఎక్కువ విద్యార్థులు పాఠశాలలో చదివితే ఇద్దరు ఉపాధ్యాయులు అవసరం ఉంటుంది. గతంలో విద్యార్థులకు సరిపడా టీచర్‌ను డిప్యూటేషన్‌పై కేటాయించడంతో ఇద్దరు ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించారు. ఈ సంవత్సరం డిప్యూటేషన్ రద్దవడంతో ఖాళీ ఏర్పడింది. ఒకే టీచర్ విద్యనందించడంతో కొంత మంది విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలకు పిల్లలను పంపిస్తున్నారు. ఉన్నతాధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో సరిపడా ఉపాధ్యాయులను కేటాయించి కనీస సదుపాయాలు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



వరండాలో నేలపై కూర్చున్న విద్యార్థులు

అలంకారప్రాయంగా నిఘా నేత్రాలు

- ప్రధాన కూడళ్లలో పనిచేయని సీసీ కెమెరాలు - పట్టించుకునే వారు కరువు.. - మరమ్మతులకు నోచుకోని వైనం..



ఇందిరాచౌక్ వద్ద పని చేయని సీసీ కెమెరాలు





మానాల ఎక్స్‌రోడ్డు వద్ద..

రుద్రంగి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు అలంకార ప్రాయంగా మారాయి. ఏదైనా ప్రమాదం, నేరం జరిగిన సందర్భంలో పోలీసుల విచారణకు ఎంతో ఉపయోగపడే సీసీ కెమెరాల పనితీరును పట్టించుకునే వారే కరువయ్యారు. ప్రజల సంక్షేమ పరిరక్షణలో కీలకంగా సీసీ కెమెరాలు పనిచేస్తాయి. అందుకే పోలీసు శాఖ, ప్రభుత్వం సీసీ కెమెరాల ఏర్పాటును ప్రోత్సహిస్తుంది. పల్లెలు, పట్టాణాలు అని తేడా లేకుండా రోడ్ల వెంట ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో, దుకాణ సముదాయాల్లో, వ్యవసాయ క్షేత్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. మండల కేంద్రంలో కొన్నేళ్ల క్రితం రుద్రంగి దుబాయ్ సంఘం ఆధ్వర్యంలో సీసీ కెమెరాలను ఏర్పాటుచేయించారు. అయితే వాటి నిర్వహణను అధికారులు పట్టించుకోకపోవడంతో ములన పడ్డాయి. అనంతరం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా అవి కూడా పని చేయడంలేదు.

ప్రధాన చౌరస్తాల వద్ద..

మండల కేంద్రం శివారులోని ప్రధాన చౌరస్తాలైన మానాల చౌరస్తా వద్ద ఒకే స్తంభానికి ఆరు సీసీ కెమెరాలు, ఇందిరాచౌక్ చౌరస్తాలో ఒకే స్తంభానికి ఆరు కెమెరాలు ఏర్పాటు చేయగా, ఏ ఒక్కటి పని చేయడం లేదు. అలాగే రుద్రంగిలోని బస్టాండ్ ప్రాంతంలో, అంబేద్కర్ చౌరస్తా, హనుమాన్ ఆలయం, పోలీస్ స్టేషన్ సమీపంలో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా, కొన్నిచోట్ల కేబుల్స్ కట్ కావడంతో సీసీ పని చేయడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పని చేయని సీసీ కెమెరాలను మరమ్మతులు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు. అలాగే మరిన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

వీధి వ్యాపారుల్లో రుణాల ఆశలు

(3వ పేజీ తరువాయి)

రూ 20వేలు, మూడవ విడతగా రూ50వేల రుణాలు ఇచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో చాలామంది వీధి వ్యాపారులు మొదటి విడతలో ఎంతో ఉత్సా హంగా తీసుకున్న రూ10వేల రుణాన్నిచెల్లించి రూ.20వేలరుణాన్ని తీసుకున్నారు. మూడో విడతలో మాత్రం ముందుకు రాలేదు. జిల్లాలో వీధి వ్యాపారులకు రుణా లు.. అందించడానికి 8,418మంది లక్ష్యంగా పెట్టుకున్నారు. స్వనిధి ద్వారా జిల్లాలో 26.40కోట్ల రుణాల పంపిణీ జరిగింది. దరఖాస్తులు 8507మంది మొదటి విడతలోనే చేసుకున్నారు. సిరిసిల్ల, వేములవాడ రెండు మున్సిపాలిటీల్లో మొదటి విడతలో రూ.10వేల చొప్పున 7933మంది రూ7.93కోట్లు అందించారు. వీరు ఏడాదిలోగా రూ. 10 వేలు చెల్లించి తిరిగి రెండో విడతలో 6180మంది రూ.20 వేల చొప్పున రూ12.36 కోట్లు రుణం పొందారు. మూడో విడతలో మాత్రం 1222 మం ది రూ 50 వేల చొప్పున రూ6.11కోట్ల రుణాలు పొందారు. స్వనిధి పక్రియను తాత్కాలికంగా నిలిపివేయడంపై వీధి వ్యాపారులు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందజేత



జ్ఞాపికలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఎల్లారెడ్డిపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత విద్యా సంవత్సరం 9వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు పాఠశాల పూర్వ విద్యార్థి, అమెరికాలో స్థిరపడిన బొమ్మ కంటి సతీష్ తల్లి బాలలక్ష్మీ జ్ఞాపకార్థంసమకూర్చిన రూ.10 వేల నగదు ప్రోత్సాహకంతో పాటు జ్ఞాపికలను ఆయన సోదరుడు వెంకటేశం మంగళవారం అందజేశారు. విద్యార్థులను చదువులో ప్రోత్సహించేందుకు సతీష్ ప్రతి యేటా విద్యార్థులకు నగదును సమకూరుస్తున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం మనోహరాచారి, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, హన్మండ్లు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన పీసీసీ మాజీ కార్యదర్శి

సిరిసిల్ల టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర చేనేత జౌళిశాఖ, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చాంబర్‌లో మాజీ పీసీసీ కార్యదర్శి, రైతు బంధు సమితి రాజన్న సిరిసిల్ల జిల్లా మాజీ అధ్యక్షుడు గడ్డం నర్సయ్య మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. రైతు నాయకుడు నల్లమల వెంకటేశ్వర్‌రావు ఉన్నారు.

బీజేపీ మండల ప్రధాన కార్యదర్శికి సన్మానం

ఎల్లారెడ్డిపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ ఎల్లారెడ్డిపేట మండల ప్రధాన కార్యదర్శిగా నియమితులైన మండలంలోని రాచర్లగొల్లపల్లి గ్రామానికి చెందిన దాసరి గణేశ్‌ను స్థానిక ముదిరాజ్ సంఘం సభ్యులు మంగళవారం ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

ఎంపీ నిధులతో బోరు బావి తవ్వకం

ఎల్లారెడ్డిపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామంలోని మడేలేశ్వరస్వామి ఆలయం ఆవరణలో ఎంపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ నిధులతో బోరు బావి తవ్వకానికి స్థానిక బీజేపీ నాయకులు మంగళవారం భూమి పూజ చేశారు. రజక సంఘం విన్నపం మేరకు ఎంపీ నిధులను కేటాయించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, నాయకులు పర్శరాములు, బుగ్గారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, లహరి, రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆగని రేషన్ బియ్యం అక్రమ రవాణా



గంభీరావుపేటలో అక్రమంగా తరలిపోతున్న పీడీఎస్ బియ్యం

గంభీరావుపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలంలో రేషన్ బియ్యం దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. కేంద్ర, రాష్ట ప్రభుత్వాలు ప్రజా పం పిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందజేస్తున్న సన్న బియ్యాన్ని కొందరు తక్కువ ధరకు కొనుగోలు చేసి, ఎక్కువ ధరకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రజల నుంచి సన్న బియ్యాన్ని సేకరించేందుకు టీంలుగా ఏర్పడి, ద్విచక్ర వాహనాల ద్వారా సందుల్లో ఇంటింటా తిరుగుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా క్వింటాళ్ల కొద్దీ సన్న బియ్యం అక్రమార్కుల పాలవుతున్నాయి. ఇంటింటా కొనుగోలు చేసి సేకరించిన సన్న బియ్యం రహస్య ప్రదేశంలో నిల్వ చేస్తూ, క్రయవిక్రయాలు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

చార్టర్డ్ అకౌంటెంట్‌కు సన్మానం

వేములవాడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : జాతీయ చార్టర్డ్ అకౌంటెంట్స్ దినోత్సవం సందర్భంగా వేములవాడ పట్టణానికి చెందిన సీనియర్ చార్టర్డ్ అకౌంటెంట్ తోట ఆంజనేయులును స్థానిక మున్నూరు కాపు సంఘం నాయకులు మంగళవారం ఘనంగా సత్కరించారు. మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు కోయినేని బాలయ్య, ప్రదాన కార్యదర్శి సోమినేని మహేష్, ఉపాధ్యక్షులు ఉప్పుల దేవరాజు, నామాల శేఖర్, తోట శేఖర్ తదితరులు సీఏ తోట ఆంజనేయులు సత్కరించారు. స్థానిక లయన్స్ క్లబ్ ప్రతినిధులు గోస్కుల రవి, కొలిపాక నరసయ్య తదితరులు సీఏ తోట ఆంజనేయులు సత్కరించారు.

ఎస్ఐని సన్మానించిన బీజేపీ నాయకులు

వీర్నపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండల నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన లక్ష్మణ్‌ను బీజేపీ మండలాధ్యక్షుడు మాలోతు లక్పతి నాయక్ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం శాలువాతో సత్కరించారు. మారుమూల గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపి మండల ప్రధానకార్యదర్శులు నాగరాజు, పీర్యా, నాయకులు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం బాధ్యతగా తీసుకోవాలి

ఇల్లంతకుంట, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మొక్కలు నాటడాన్ని ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని ఎస్సై సిరిసిల్ల అశోక్ సూచించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం మొక్కలను నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళి మనగడ చెట్లపై ఆధారపడి ఉందన్నారు. మొక్కలను నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

తంగళ్లపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తంగళ్లపల్లి ఎస్సై ఉపేంద్రచారి అన్నారు. తంగళ్లపల్లి మండలంలోని బెల్ట్‌షాప్ నిర్వాహకులకు పోలీసులు కౌన్సెలింగ్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఉపేంద్రచారి మాట్లాడుతూ విచ్చలవిడిగా మద్యం విక్రయాలు గ్రామాల్లో జరుగుతుండడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు, గొడవలు జరుగుతున్నాయని వివరించారు. ఇకనుంచి మద్యం విక్రయాలను నిలిపివేయాలని నిర్వాహకులను హెచ్చరించారు.

తంగళ్లపల్లి మండల ట్రాక్టర్ యూనియన్ కార్యవర్గం

తంగళ్లపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : తంగళ్లపల్లి మండల ట్రాక్టర్ యూనియన్ కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బొల్లి రామ్మోహన్, అధ్యక్షుడిగా చందా భాస్కర్, ఉపాధ్యక్షులుగా బండి మల్లేశం, చింతలపల్లి శ్రీనివాసరావు, ప్రధానకార్యదర్శిగా బెంద్రం పవన్ రెడ్డి, కోశాధికారిగా నల్వాల పూర్ణచందర్, సహాయ కార్యదర్శులుగా ల్యాగల యాదగిరి, అమరగొండ ప్రభుదాస్, కొలపురం ఆనంద్, పొన్నాల మహేష్, గంగారెడ్డిలు ఎన్నికయ్యారు.

బాధితుడికి పరామర్శ

కోనరావుపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మోకాలు శస్త్ర చికిత్స చేయించుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలకు పార్టీ నేత ఏనుగు మనోహర్‌రెడ్డి పరామర్శించారు. కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామానికి చెందిన జిన్న శ్రీకాంత్, నందగిరి భూమేష్ మోకాలు శస్త్ర చికిత్స చేయించుకొని ఇంటికి వచ్చారు. వారిని ఆయన పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు కచ్చకాయల మహేష్, నందగిరి రఘు, వంగల శ్రీనివాస్, సతీష్, జిన్నా అనిల్, కిరణ్ గౌడ్, బాబు, సాయి, వంశీ, అబి తదితరులు ఉన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

చందుర్తి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని ఎంపీడీవో రాధ అన్నారు. మండలంలోని మూడపల్లిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని అందించారు. కార్యక్రమంలో ఎంపీవో ప్రదీప్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు, పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలల్లో మెరుగైన బోధన

సిరిసిల్ల టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మెరుగైన బోధన అందించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమీకృత కార్యాలయం మినీ సమావేశం మందిరంలో కలెక్టర్ ఇంటర్ విద్యపై ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లతో సమీక్షను నిర్వహించారు. జూనియర్ కళాశాలలో విద్యార్థుల ఎనరోల్ మెంట్, ఇంటర్ పరీక్షల ఫలితాలు జూనియర్ కళాశాలలో మైనర్ రిపేర్లు, విద్యార్థుల సంక్షేమ కార్యక్రమాలు పోటీ పరీక్షల శిక్షణ, ఫైర్ సేఫ్టీ, ఇతర మౌలిక సదుపాయాలు వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలల పరిధిలో మొదటి సంవత్సరం 1777 అడ్మిషన్లు సాధించడం లక్ష్యం కాగా, 63 శాతం అంటే 1116 మంది విద్యార్థులు ఎనరోల్ చేసుకున్నారన్నారు. జూనియర్ కళాశాలలో అడ్మిషన్స్ పెంచేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. జూనియర్ కళాశాలలో సివిల్ వర్క్, విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్యం, నీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాల కల్పన మైనర్ రిపేర్ పనులకు ప్రభుత్వం రూపాయాలు కోటి 80 లక్షలు మంజూరు చేసిందని, నిధులను సద్వినియోగం చేసుకుంటూ కళాశాలలో మరమ్మతులు చేయించాలన్నారు. జూనియర్ కళాశాలలో అందించే విద్య నాణ్యత పెరగాలని అధ్యాపకులు సకాలంలో కళాశాలలకు హాజరు కావాలని అన్నారు. విద్యార్థులకు అర్థమయే రీతిలో బోధన జరగాలని పేర్కొన్నారు. 2024 - 25 విద్యా సంవత్సరంలో సప్లమెంటరీ పరీక్షలు ముగిసిన తర్వాత వేములవాడ, ఎల్లారెడ్డిపేట, ఇల్లంతకుంట కళాశాలలో ఫలితాలు చాలా తక్కువగా వచ్చాయన్నారు. జిల్లాలో ఇంటర్ విద్య చాలా వెనకబడిందని, మౌలిక వసతుల కల్పన పనులు, పరీక్ష ఫలితాల్లో చాలా మెరుగు పడాలని సూచించారు. జూనియర్ కళాశాల విద్యార్థుల సంక్షేమం కోసం అవసరమైన చర్యలు కట్టుదిట్టంగా తీసుకోవాలని అన్నారు. ప్రతి జూనియర్ కళాశాలలో రెగ్యులర్‌గా స్టూడెంట్ కౌన్సిలర్ల ద్వారా విద్యార్థులకు అవసరమైన శిక్షణ అందించాలన్నారు. జూనియర్ కళాశాలలో యాంటీ డ్రగ్స్ కమిటీ ఏర్పాటు చేసి పోలీసుల సహకారంతో విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మెడిసిన్, ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షల కోసం అందించిన ప్రత్యేక శిక్షణతో మంచి ఫలితాలు సాధించామని ఇదే స్ఫూర్తితో కొనసాగించాలన్నారు. విద్యార్థులదరికి పాఠ్యపుస్తకాలు, ఇతర పోటీ పరీక్షల పుస్తకాలు సకాలంలో అందించాలన్నారు. కళాశాలలో క్రీడలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అందుకోసం టెన్నిస్ కోర్టు, టేబుల్ టెన్నిస్, క్యారం, చెస్ బోర్డులు ఉండేలా ఏర్పాట్లు చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. గ్రామాల నుంచి విద్యార్థులు కళాశాలలకు వచ్చే రూట్లలో బస్సులు నడిపే విధంగా ప్రతిపాదనలు అందించాలని సూచించారు.

ఈ సమావేశంలో జిల్లా ఇంటర్ బోర్డు నోడల్ అధికారి శ్రీనివాస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.

విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి



ఉపాధ్యాయుడి బోధనా తీరును పరిశీలిస్తున్న కలెక్టర్

వేములవాడ రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. ఆర్అండ్ఆర్ కాలనీ చింతల్‌ఠాణాలోని ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులను సందర్శిస్తూ ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించారు. ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పాఠశాల భవనంపైన కిచెన్ షెడ్‌ను సాధ్యమైనంత త్వరగా నిర్మించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల హాజరు వివరాలను అడిగితెలుసుకుని, అందించే ఆహార నాణ్యతను పరిశీలించారు.

విద్యార్థులకు అందుబాటులోకి డెస్క్‌లు

చింతల్‌ఠాణా ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించిన నేపథ్యంలో విద్యార్థులకు సరిపడా డెస్క్‌లు లేవని గుర్తించిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా విద్యార్థులకు డెస్క్‌లు అందుబాటులో ఉండాలని అధికారలను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కొన్నిగంటల్లోనే విద్యార్థుల కోసం అధికారులు డెస్కులను ఏర్పాటు చేశారు. డెస్కులను అందుబాటులో ఉంచడంపై విద్యార్థులు ఆనందం వ్యక్తంచేశారు.

ఇందిరమ్మ లబ్ధిదారులపై అదనపు భారం

వేములవాడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : పెరుగుతున్న ధరలతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులపై అదనపు భారం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కడారి రాములు అన్నారు. మంగళవారం ఆయన వేములవాడ పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇళ్లు లేని నిరుపేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరుచేసిన తరుణంలో వ్యాపారులు సిమెంటు, సలాక ధరలను, ఇతర గృహ నిర్మాణ వస్తువుల ధరలను ఇష్టారాజ్యంగా పెంచి అమ్ముతున్నారని ఆరోపించారు. ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే ఇసుక మట్టి కంకర ధరలు సైతం ఆకాశాన్ని అంటుతున్నాయని, అక్రమ రవాణా పేరిట అధికారులు కేసు నమోదు చేస్తుండడంతో రవాణా దారులు అన్నింటి రేట్లను రెండింతలు మూడింతలు పెంచి ప్రజలపై అదనపు భారం మోపుతున్నారని అన్నారు. ఈ అంశంపై ప్రభుత్వ యంత్రాంగం దృష్టి సారించి గృహనిర్మాణ వస్తువుల ధరలు తగ్గే విధంగా చొరవ తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో వేములవాడ పట్టణ సీపీఐ కార్యదర్శి ఎల్ల దేవరాజు, పోశెట్టి, కోరేపు క్రాంతి, శ్రీనివాస్, పెంట రాజేష్, రాజు, దుర్గయ్య, గాజుల రమేష్ తదితర సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

మొక్కలు నాటే ప్రక్రియను పూర్తి చేయాలి : డీఆర్డీవో



అచ్చన్నపల్లిలో ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్న డీఆర్డీవో శేశాద్రి

చందుర్తి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మొక్కలు నాటే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని డీఆర్డీవో శేషాద్రి అన్నారు. మండలం మూడపల్లి గ్రామంలో ఉపాధిహామీ పనులను డీఆర్డీవో శేషాద్రి మంగళవారం తనిఖీ చేశారు. గ్రామంలో జరుగుతున్న ప్లాంటేషన్ ఫిట్టింగ్ జరుగుతున్న పనులను పరిశీలించారు. డీఆర్డీవో శేషాద్రి మాట్లాడుతూ చందుర్తి మండల ప్లాంటేషన్ టార్గెట్ 7వేలు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాధ, ఎంపీవో రాజయ్య, టెక్నికల్ అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్‌అసిస్టెంట్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన

వేములవాడ రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అచ్చన్నపల్లి, వెంకటాంపల్లి గ్రామాలలో జరిగే ఉపాధిహామీ పనులను డీఆర్డీవో శేశాద్రి మంగళవారం పరిశీలించారు. మొక్కలునాటే విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధిహామీ కూలీలకు సకాలంలో చెల్లింపులు చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్ పలువురు అధికారులు ఉన్నారు.

ఘనంగా వైద్యుల దినోత్సవం



ఇల్లంతకుంటలో వైద్యాధికారిని సన్మానిస్తున్న సిబ్బంది



చందుర్తిలో సన్మానం పొందిన వైద్యులు



బోయినపల్లిలో సంబరాలు..

ఇల్లంతకుంట, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఘనంగా వైద్యుల దినోత్సవం జరిగింది. ఆసుపత్రిలో మంగళవారం కేక్ కట్ చేసి వైద్యాధికారి జీవనజ్యోతిని సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను కాపాడటానికి అహర్నిశలు కష్టపడే వైద్యులను ప్రతి ఒక్కరు గౌరవించవలసిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్ఈఓ వెంకటరమణప్రసాద్, పీహెచ్ఎన్ తారాభాయి, సూపర్‌వైజర్లు జవహర్, శోభారాణి, గిరిధర్, శారద, సుజాత, కవిత తదితరులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలంలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. స్థానిక అశ్విని ఆసుపత్రి నిర్వాహకులు, వైద్యుడు సత్యనారాయణస్వామి, వైద్యుడు అభినయ్‌లను పలువురు నాయకులు, స్థానికులు ఘనంగా సన్మానించారు. సీహెచ్‌సీలో వైద్యులను సిబ్బంది శాలువాలు, పూలమాలతో సత్కరించారు. వైద్యుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● ముస్తాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ముస్తాబాద్ మండల కేంద్రంలో వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వైద్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం స్థానిక పీహుల్స్ ఆసుపత్రి ఆవరణలో సీనియర్ వైద్యులు డాక్టర్ చింతోజు శంకర్‌ను శ్రీవాణి విద్యానికేతన్ విద్యార్థులు సత్కరించారు. చిన్నారులతో స్వీట్లు తినిపించారు. డాక్టర్ చింతోజు శంకర్ పేద విద్యార్థులకు అందిస్తున్న సేవలు ఎనలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రజిని, విద్యార్థులు పాల్గొన్నారు.

● చందుర్తి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండల కేంద్రాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ వైద్యుల దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ సురేష్ కుమార్, సాత్విక కృష్ణవేణి, రేణుక,లను వైద్య సిబ్బంది శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఆసుపత్రికి సిబ్బంది పాల్గొన్నారు.

● రుద్రంగి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) జాతీయ వైద్యుల దినోత్సవం, జాతీయ పోస్టల్ వర్కర్స్ డే సందర్భంగా రుద్రంగి మండల కేంద్రంలోని డాక్టర్స్, పోస్టల్ సిబ్బందిని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు బండి యాదగిరి, సెక్రెటరీ కొమిరె శంకర్, తిపిరెడ్డి వేంకటరెడ్డి, మంచె రమేష్, అంబటి శంకర్, గోడికారి హీరోజి, కర్నవత్తుల దేవేందర్, అంతయ్య తదితరులు పాల్గొన్నారు.

● బోయినపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి మండల కేంద్రంలో డాక్టర్స్ డే మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఐఎంఏ సిరిసిల్ల, ఎఫ్‌వోజీఎస్ఐ కరీంనగర్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని చెన్నాడి రాధమ్మ ఫంక్షన్ హాల్‌లో మెగా హెల్త్‌క్యాంపు నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరంలో దాదాపు 500 మంది వరకు రోగులు పరీక్షలు నిర్వహించారు. ఉచిత మందులను అందజేశారు.

ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుమన్ మో హన్‌రావు, అధ్యక్షులు డాక్టర్ ఎం శ్రీనివాస్, ఎఫ్‌వోజీ ఎస్ఐ అధ్యక్షులు డాక్టర్ ఎన్ పద్మలత, ఐఎంఏ సెక్రెట రీ డాక్టర్ అభినయ్, ఎఫ్‌వోజీఎస్ఐ సెక్రెటరీ డాక్టర్ ఐఎంఏ ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్‌వీ రమణారావు స్ర వంతి, వైద్యులు స్వప్న, సంతోష్, నల్ల మధు తిరుపతి, రజని గోపీనాథ్, సతీష్, రాజేందర్, అజిత్ కుమార్, నాగార్జున, శశిధర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయాలి

- బీజేపీ మండలాధ్యక్షుడు లక్పతి నాయక్

వీర్నపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా అధికారులు బాధ్యతయుతంగా పనిచేయాలని బీజేపి మండలాధ్యక్షుడు మాలోతు లక్పతి నాయక్ కోరారు. వీర్నపల్లి మండలం మద్దిమల్ల తండా గ్రామంలో గిరిజనుల కోసం ఏర్పాటు చేసిన పీఎం జన జాతీయ గౌరవ్ వర్ష్ వేడుకల కార్యక్రమాన్ని నాయకులతో కలిసి సందర్శించారు. అనంతరం సమావేశం ఏర్పాటుచేసి ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ కార్యక్రమంపై మారుమూల గిరిజనులకు అధికారులు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఇంత పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన సంబంధిత అధికారులు అర్ధంతరంగా మధ్యలోనే వెళ్లిపోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమం ముగిసే వరకు సంబంధిత శాఖల సిబ్బంది దరఖాస్తులు తీసుకునేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బుధవారం జవర్లాల్ తండా, 3న సీతారాంనాయక్ తండాలో జరిగే కార్యక్రమానికి గిరిజనులు హాజరై సమస్యలను అధికారులకు తెలియజేయాలని కోరారు. ప్రధాన కార్యదర్శులు పిట్ల నాగరాజు, బట్టు పీర్యా, బీజేవైఎం మాజీ మండలాధ్యక్షుడు బండారి మహేష్ పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికపై సంబరాలు

ఇల్లంతకుంట, జూలై 1(ఆంధ్రజ్యోతి):బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుగా రామచంద్రారావు ఎన్నికపై నాయకులు సంబరాలు నిర్వహించారు. మండలకేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో మంగళవారం టపాసులు కాల్చి, స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు భూమల్ల అనీల్‌కుమార్, నాయకులు బత్తిని సాయగౌడ్, మ్యాకల మల్లేశం, దేశెట్టి శ్రీనివాస్, ముత్తక్క, నాగసముద్రాల సంతోష్, బత్తిని స్వామి, చిమ్మనగొట్టు శ్రీనివాస్, అనీల్, గోపి, కమలాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.